జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 21 | మే | 2025 ◆ పేజీలు : 6

# పార్టీ మారని వారికే పదవుల్లో ప్రాధాన్యత

- కాంగ్రెస్ పార్టీ అంటేనే చరిత్ర
- పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి



**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ పార్టీ మారకుండా ఉన్న వారికే పదువులలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా అబ్జర్వర్లు, టిపిసిసి ఉపాధ్యక్షులు డా. శ్రవణ్ కుమార్ రెడ్డి, టిపిసిసి జనరల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్య లు స్పష్టం చేశారు. మంగళవారం పాత బస్టాండ్ లోని

మిగతా 2 లో...






# రేపటి నాయకత్వానికి... నేడే మార్గదర్శకం

- సింగరేణిన సంస్థ సి అండ్ ఎండి ఎన్. బలరామ్
- సింగరేణి భవిష్యత్తుకు యువతరం అధికారులు బాసటగా నిలవాలి
- మూడేళ్లలో అనుభవజ్ఞులైన అధికారులందరి పదవీ విరమణ
- యువ అధికారులకు సింగరేణి భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన, ఆచరణ అత్యవసరం
- కీలక ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ చర్యలకు అధిక ప్రాధాన్యత

**కొత్తగూడెం సింగరేణి, మే 20, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థలో రానున్న మూడేళ్లలో అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులు పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో యువ సింగరేణి అధికారులు ఇప్పటి నుండే సంస్థ ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలు, వ్యాపార విస్తరణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని, సంస్థ భవిష్యత్తుకు బాసటగా నిలవాలని సంస్థ చైర్మన్ , ఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ చరిత్రలో తొలిసారిగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులైన మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లతో ఆయన మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని ఏరియాల నుండి వివిధ విభాగాలకు చెందిన సుమారు 762 మంది పాల్గొన్నారు. చైర్మన్ తో పాటు సంస్థ డైరెక్టర్లు వివిధ విభాగాల ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సింగరేణి ప్రస్తుత బొగ్గు ధర దేశంలో ఏ ఇతర బొగ్గు కంపెనీల కన్నా చాలా ఎక్కువగా ఉందని, కనుక వినియోగదారులు తక్కువ ధరకు బొగ్గు లభించే వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది చాలా ప్రమాదకరం కనుక కనీసం టన్నుకు వెయ్యి రూపాయలు తగ్గించే విధంగా సింగరేణి వ్యాప్తంగా ఉత్పాదకత పెంచాలని, ఉత్పత్తి వ్యయం తగ్గించాలని, ఇందుకు యువ అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాత గనులు

మిగతా 2 లో...

# ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ తప్పనిసరి

- జిల్లా రవాణా అధికారి వెంకటరమణ

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 20, ప్రజాజ్యోతి :** త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న దృశ్య కొత్తగూడెం జిల్లా రవాణా కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన డ్రైవర్లకు జిల్లా రవాణా అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ వాహనం నడిపే ముందు ఫిట్నెస్ చెక్ చేసిన తర్వాతనే పిల్లలను బస్సులో కి ఆహ్వానించాలని, ప్రతి వాహనానికి అటెండెంట్ ఉండాలని, ప్రతి నెల డ్రైవర్ తమ ఆరోగ్యం

మిగతా 2 లో...



# మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు అండగా పోలీసులు

- ఆదివాసీల అభివృద్దే పోలీసులు లక్ష్యం
- కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**చర్ల, మే20, ప్రజాజ్యోతి:** చర్ల మండలం చత్తీస్గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన చెన్నాపురంలో చర్ల పోలీసులు కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు నిర్వహించిన

మిగతా 2 లో...



## పార్టీ మారని వారికే పదవుల్లో ప్రాధాన్యత





(మొదటి పేజీ తరువాయి...)
ఐత ఫంక్షన్ హాల్ లో జరిగిన ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు పట్టణం, మండలం, టేకులపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే చరిత్ర అని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదేవిధంగా మనమందరం కాంగ్రెస్ పార్టీలో ఉండడం మన అదృష్టమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలను కలుపుకొని పోయేది కేవలం కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, టీపీసీసీ అధ్యక్షుడు రాష్ట్రంలో ప్రతి మండలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు ఇవ్వాలని ఆలోచన చేయడం సంతోషకరమన్నారు. 2017 నుండి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే వారికే పదవులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పార్టీలో పదవులు తీసుకొని పార్టీ కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన వారు కష్టసుఖాల్లో పార్టీని నమ్ముకొని క్రమశిక్షణతో పార్టీ కార్యక్రమాలు, సమస్యలతో ఉన్నవారికి అండగా సేవ చేసిన వారికి పదవుల రూపంలో గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అధిష్టానం టిపిసిసి సూచనల మేరకు ఇల్లందు పట్టణం, మండలం, టేకులపల్లి మండలం, కాంగ్రెస్ పార్టీ నామినేట్ పోస్టులకు దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్ని సంవత్సరాల నుండి పని చేస్తున్నారో, ఏ స్థాయిలో సేవ చేశారో వివరాలు ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను గాంధీ భవన్ కు తీసుకువెళ్లి పరిశీలించి మొదటి నుండి ఎవరు సేవ చేశారో వారికి న్యాయం చేస్తామని తెలిపారు. సామాజిక న్యాయం పాటిస్తూ అధిష్టానం ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశా రు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మడుగు సాంబమూర్తి, మండల రాము, భోళ్ల సూర్యం, దొడ్డ డానియల్, పులి సైదులు, చిల్లా శ్రీనివాస్, తాటి బిక్షం, భూక్య దళ్ సింగ్, ఇస్లావత్ రెడ్యానాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ తప్పనిసరి



(మొదటి పేజీ తరువాయి...)
చెకప్ చేసుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, చట్ట ప్రకారం కడుచుకోవాలని, పాఠశాలల యాజమాన్యాలు, డ్రైవర్లు బాధ్యతగా ఉండాలని కోరారు. స్కూల్ పిల్లల విషయంలో అశ్రద్ధ చేస్తే సహించేది లేదన్నారు. ప్రతి పాఠశాలలో నడిపే వాహనాలకు ఇన్వాయిస్ కలిగి ఉండడంతో పాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం స్కూల్ బస్సు కు ఉండాల్సిన నియమ నిబంధనల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

# రేపటి నాయకత్వానికి... నేడే మార్గదర్శకం



మొదటి పేజీ తరువాయి...)
కొన్ని మూతబడుతున్న నేపథ్యంలో, ఒడిశాలోని నైనీ బ్లాకు, కొత్తగూడెంలో వికె ఓసి, ఇల్లందులో జేకే ఓసి, బెల్లంపల్లిలో గోలేటి ఓసిల నుండి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నామని, తద్వారా 20 మిలియన్ టన్నుల అదనపు ఉత్పత్తి సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు. కనుక ఈ ఏడాది నిర్దేశిత 76 మిలియన్ టన్నుల లక్ష్యాలు సాధించే అవకాశం ఉందన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలలో కూడా బొగ్గు బ్లాకులు చేపట్టడానికి సింగరేణి సంస్థ ముమ్మరంగా ప్రయత్నిస్తోందన్నారు. కానీ రానున్న కాలంలో సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి పైనే ఆధారపడి మనుగడ సాధించలేదని స్పష్టం చేశారు. పర్యావరణ ఆంక్షలు, బొగ్గు నిల్వల తరుగుదల వల్ల మరో 20 ఏళ్లలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోతుందని, తద్వారా బొగ్గు ఉత్పత్తి కూడా తగ్గుతుందన్నారు. కనుక సింగరేణి సంస్థ కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టాలని నిర్ణయించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా కీలక ఖనిజాల ఉత్పత్తి దారులకు సంపూర్ణ ప్రోత్సాహం ఇస్తున్నందువల్ల ఈ రంగంలో సింగరేణి మంచి అవకాశాలు ఉండబో తున్నాయని పేర్కొన్నారు. అలాగే ఇతర ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి కూడా సింగరేణి అడుగుపె డుతోందని, దీనికోసం మూడు ఏజెన్సీలను కూడా నియమించుకోవడం జరిగిందన్నారు. అవసరమైతే ఇతరకంపెనీలతో కలిసి జాయింట్ వెంచర్ గా కూడా ఈ రంగాల్లో ముందుకు వెళ్తామన్నారు. ఇప్పటికే సింగరేణి ఓవర్ బర్డెన్ నుంచి ఇసుక తయారీ యూనిట్లను ఏర్పాటు చేసిందని, అలాగే ఫ్లై యాష్ నుండి, కార్బన్ డయాక్సైడ్ నుండి ఇతర ఉత్పత్తులు సాధించడానికి రంగం సిద్ధమైందన్నారు. దీనికి ముందస్తుగా సింగరేణి ప్రాంతంలో జియో కెమికల్ లేబరేటరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వారు 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారని, దీనిలో సింగరేణి కనీసం నాలుగు నుంచి ఐదు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి పూనుకోవాల్సి ఉందన్నారు. ప్రస్తుత 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదనను 800 మెగావాట్ల కొత్త ప్లాంట్ ఏర్పాటు ద్వారా 2000 మెగావాట్లకు పెంచుతున్నామని, ఒడిశాలో మరో 1600 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయబోతు న్నామన్నారు. తద్వారా రాష్ట్రంలో అత్యధిక థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థగా సింగరేణి నిలవబో తుందన్నారు. సింగరేణి బహుముఖ విస్తరణ చర్యల పైన, ఆర్థిక స్థితిగతుల పైన భవిష్యత్తులో సింగరేణికి నాయకత్వం వహించనున్న నేటి యువ అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్న ఉద్దేశంతోటే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ల ద్వారా వివిధ విషయాలను లోతుగా వివరించారు. ఆ తరువాత ఏరియాల నుండి యువ అధికారులు తమ సలహాలను, సూచనలను, సందేహాలను కూడా వ్యక్తం చేశారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. కొత్తగూడెం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఛైర్మన్ తో పాటు, డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, జీఎం సి పి పి మనోహర్, కార్పొరేట్ జీఎం లు ఇంకా వివిధ విభాగాల అధికారులు, హైదరాబాద్ కార్యాలయం నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభాని, జీఎం మార్కెటింగ్ ఎన్.వి.రాజశేఖర్ రావు, అన్ని ఏరియాల జీఎం లు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నకు పట్టువస్త్రాలు సమర్పణ



**భద్రాచలం కల్చరల్ , మే 20(ప్రజాజ్యోతి ):** కొండగట్టులో ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం తరఫున ఆంజనేయస్వామివారికి పట్టువస్త్రాలను ఆలయ ఈవో రమాదేవి మంగళవారం సమర్పించారు. ఆలయ ఈవో వైదిక సిబ్బందితో కలిసి కొండగట్టు వెళ్లి వీటిని సమర్పించి అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు అండగా పోలీసులు



(మొదటి పేజీ తరువాయి...)
ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. చెన్నాపురం గ్రామం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే మహిళలకు, చిన్న పిల్లలకు దుస్తులతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారథ్యంలో ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని, అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు కేశవ, నర్సిరెడ్డి, సిఆర్పిఎఫ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# జెకె ఓసి కార్మికుల బదిలీలను నిలిపివేయాలి

**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జెకె ఓసిలో పని చేస్తున్న కార్మికుల బదిలీలను నిలిపివేయాలని టీబీజికెఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్ లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఒకవైపు ఇల్లందును కాపాడుతామని చెబుతూ, మరోవైపు కార్మికులను బదిలీలను ఆపుతామని చెప్పి గెలిచిన సంఘాలు కార్మికులను బదిలీలు చేస్తుంటే అపకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. పూసపల్లి ఓసికి ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ వచ్చినప్పటికీ, కొత్త ఓసి వల్ల తమకు భవిష్యత్ ఉంటుందని, ఇక బదిలీలు ఉండవని భావించిన వారికి నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గెలిచిన సంఘాలు, నాయకులు ఒక్క కార్మికుడిని ఇల్లందు నుంచి బదిలీలు కానివ్వమని పేర్కొనడంతో వారు భరోసా



గా ఉన్నారని, యాజమాన్యం మాత్రం డిప్యూటేషన్ వంకతో వంద కిలోమీటర్ల వరకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా పాఠశాలలు ప్రారంభం అవుతున్న తరుణంలో ఇలా బదిలీలు చేయడం ఎంతవరకు న్యాయమని కార్మికులు వాపోతున్నారన్నారు. కొంతమంది సీనియర్ కార్మికులు మాకు బదిలీలు కావాలని అడుగుతున్నా వారిని పక్కన పెట్టీ డిప్యూటేషన్ ఇవ్వడమేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. సీనియారిటీని కాదని ప్రొటెక్టెడ్ వర్క్ మెన్ అని కొంతమంది జూనియర్ కార్మికులను అప్పటికప్పుడు జియం స్ట్రక్చర్ కమిటీలో పేర్లు పెట్టించి వారిని ఆపే ప్రయత్నం కార్మిక ద్రోహమేనని, ఇది కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసినట్లే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు సింగరేణి చైర్మన్ పారదర్శకంగా బదిలీలు చేయాలని చెబుతున్నప్పటికి కొందరి బదిలీలు నిలుపుదల చేసేందుకు అడ్డదారుల్లో కార్మికసంఘాలు ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని, దీనిని టిబిజీకెఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రొటెక్టెడ్ వర్క్మెన్ కు కూడా కొన్ని గైడ్ లైన్స్ ఉన్నాయని, వాటిని పాటించాలని లేదంటే కార్మికుల పక్షాన ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. బదిలీలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత ఏరియా అధికారులపై ఉందని, అవినీతికి ఆస్కారం లేకుండా ఏరియా గౌరవాన్ని కాపాడాలని కోరారు.

## మోడెం వంశీకి రూ.80,000 ఆర్థిక సహాయం



**భద్రాచలం టౌన్, మే 20, ప్రజాజ్యోతి :** ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మోడెం వంశీకి భద్రాచలం ఐఎంఏలో ఉన్న డాక్టర్లు అందరూ కలిసి 80 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. మే 5వ తారీకు నుండీ 12వ తారీకు వరకు ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో జరిగిన అంతర్జాతీయ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో మోడెం వంశి ఇరవై దేశాలతో పోటీపడి, మన భారతదేశానికి బంగారు పతకాలు సాధించడమే కాకుండా, స్ట్రాంగ్ మెన్ టైటిల్ని కూడా సాధించడం జరిగింది. వంశీ ఇప్పటి వరకు రెండు అంతర్జాతీయ పోటీల పతకాలతో ఇప్పుడు మూడవ అంతర్జాతీయ పోటీలో కూడా పతకాలు సాధించాడు. అయితే ఈ పోటీలకు, ఎంపికైన క్రీడాకారుడు పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియాకు ఎంట్రీ ఫీజు నిమిత్తం 80,000 రూపాయలు చెల్లించవలసి ఉండగా, నిరుపేద గిరిజనుడు అయిన మోడెం వంశీ కి భద్రాచలంలోని ఐఎంఏ లో ఉన్న డాక్టర్లు అందరూ కలిసి ఈ ఫీజు మొత్తాన్ని చెల్లించడం కోసం 80 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. గతంలో కూడా డాక్టర్లందరూ కలిసి మోడెం వంశీని సౌత్ ఆఫ్రికా సన్ సిటీ లో జరిగిన పోటీలకు వెళ్లేటప్పుడు కూడా ఇబ్బంది పడుతున్న విషయాన్నీ గుర్తించి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. మోడెం వంశీ కి సహాయం చేసిన భద్రాచలం ఐఎంఏ లో ఉన్న డాక్టర్లు అందరి పట్ల భద్రాచలం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మోడెం వంశీ మాట్లాడుతూ నాకు సహాయం అందించిన ప్రతి ఒక్కరికి ఎప్పటికీ రుణపడి ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు అంతేకాకుండా భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులైన భోగాల శ్రీనివాస్ రెడ్డి, జీవీ రామిరెడ్డి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, మహంతి వెంకట కృష్ణాజీ , గుగులోతు శోభన్ నాయక్ ల సహకారం వల్లనే తను ఈ విజయాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

## కార్మికుల శ్రమ దోపిడిని బడా పారిశ్రామిక సంస్థలకు దోచి పెడుతున్న మోడి ప్రభుత్వం







**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి :** కార్మికుల శ్రమ దోపిడిని బడా పారిశ్రామిక సంస్థలకు మోదీ ప్రభుత్వం దోచి పెడుతుందని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్, ఐఎన్టియుసి నాయకుడు భుక్యా నాగేశ్వరరావు, ఐఎఫ్టియు నేత భయ్యా వరప్రసాద్, సిఐటియు నేత సిరాజ్ అహ్మద్ టిబిజికెఎస్ ఉపాధ్యక్షుడు మహ్మద్ జాఫర్ హుస్సేన్ లు ఆరోపించారు. మంగళవారం ఇల్లందులో అన్ని గనులు, డిపార్ట్మెంట్ లలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి సింగరేణి జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రోటెస్ట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఈ నెల 20న నిర్వహించాల్సిన దేశవ్యాప్త సమ్మెకు బదులుగా జెకె ఓసి, కేఓసి, ఏరియా వర్క్ షాప్, ఎస్ అండ్ పీసీ, సిహెచ్పిలలో కార్మికుల నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రోటెస్ట్ డే నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లుగా మార్చిందని, దీని వల్ల ఇప్పుడు కార్మిక వర్గం అనుభవిస్తున్న అనేక హక్కులు హరించిపోతాయన్నారు. కార్మిక చట్టాల మార్పు వల్ల సింగరేణికి నూతన గనులు రావడం లేదని, పని గంటలు పెంచే అవకాశం ఉందని, సమ్మె చేసే హక్కు ఉండదని, 4 లేబర్ కోడ్ ల వల్ల ఉన్న హక్కులు పోతాయని పేర్కొన్నారు. సింగరేణిలో కొత్త గనులు వస్తేనే మనుగడ కొనసాగుతుందని, ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, నూనె శ్రీనివాస్, దాట్ల వెంకటేశ్వర్లు, వీరన్న, శ్రీనివాస్ రెడ్డి, యుగేందర్, జక్కుల శ్రీనివాస్, అజ్మీరా కిషోర్, బాలు కుమార్, కొసూరి సత్యనారాయణ, మోహన్ రావు, బట్టు రవి, మేకల చంద్రశేఖర్, కాపు కృష్ణ, బొల్లేద్దుల శ్రీనివాస్, పైడి రాజు, టి బాలు, హుస్సేన్, పాపారావు, బొల్లమల్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియా నుండి కారుణ్య నియామకాల్లో భాగంగా మెడికల్ అన్ఫిట్ కార్మికుల వారసులకు మంగళవారం జిఎం కార్యాలయంలో ఏరియా జిఎం వీసం. కృష్ణయ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని బాధ్యతగా పనిచేయాలని, అలాగే భూగర్భ గనుల్లో పనిచేస్తే నైపుణ్యత పెరుగుతుందన్నారు. పని ప్రదేశంలో ఎల్లప్పుడూ రక్షణతో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, సంబంధిత అధికారులు తెలిపిన రక్షణ సూత్రాలు నిత్యం పాటిస్తూ సంస్థ పురోగభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉద్యోగంలో చేరిన యువత ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పనిలో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సింగరేణి లో ఉద్యోగాలు వారసత్వంగా అందించిన తల్లిదండ్రులు, కుటుంబాన్ని పోషించాలని సూచించారు. రామగుండం–1 ఏరియా భూగర్భ గనిలో పనిచేయుటకు నియామక ఉత్తర్వులు అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జిఎం రామస్వామి, డిజిఎం (పర్సనల్) జివి. మోహన్ రావు, ప్రాతినిధ్య సంఘ నాయకుడు యాదగిరి, అధికారుల సంఘం నాయకుడు ముస్తఫా, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## తాగునీటి కొరత వల్ల ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



**లక్ష్మీదేవిపల్లి, మే 20, ప్రజాజ్యోతి :** లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామ పంచాయతీ ప్రజలకు తాగునీటి కష్టాలు రోజు రోజుకు తీవ్రమవుతున్నాయి. చాలా చోట్లా రోజుల తరబడి నీళ్లు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మహిళలు రోడ్డెకుతున్నారు. మంగళవారం రేగళ్ల గ్రామస్తులు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు . గ్రామంలో గత రెండు నెలలుగా నీటి ఎద్దడితో తీవ్ర అవస్థలకు గురి అవుతున్నారు. కనీసం తాగునీరు, ఇంటి అవసరాలకు కూడా నీరు రాకపోవడంతో మినరల్ వాటర్ డబ్బాలు కొనుగోలు చేసి ఇంటి అవసరాలకు గడిపేల సినిమా దుస్థితి ఏర్పడిందని వాపోయారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియపరిచిన కూడా స్పందన లేకపోవడంతో సహనం కోల్పోయిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం ఓ పక్క వేసవికాలం తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు పదేపదే చెబుతున్నా ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం జరుగుతుందని గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మహిళలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్ లు రద్దయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం

- జూలై 9 సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపు
- జిఎం కార్యాలయం ముందు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

**కొత్తగూడెం, మే 20, ప్రజాజ్యోతి :** 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వం పై కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలని లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భూక్య రమేష్, గుడెల్లి యాకయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక రుద్రంపూర్ ఏరియా జిఎం కార్యాలయం ఎదుట ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలు తగ్గించాలని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు అమలు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని నినదించారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో పాటు సింగరేణి లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు పర్మినెంట్ కార్మికులు కాంట్రాక్టు కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక వర్గం అంతా ఒక్క తాటి మీద ఉండి సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రవి కుమార్, తాంద్ర విజయ్ కుమార్, కాంట్రాక్ట్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు .



# నల్లబ్యాడ్జీలు ధరించి ప్రొటెస్ట్ డే నిర్వహించిన సింగరేణి కార్మికులు



**టేకులపల్లి,మే20,ప్రజాజ్యోతి:** సింగరేణిలో దేశవ్యాప్త సమ్మెకు బదులుగా కేఓసి లో ఉదయం షిఫ్ట్ లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రొటెస్ట్ డే ఏఐటియుసి బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు భూక్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం తరపున పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చిందని వారు ఆరోపించారు. దీని వల్ల ఇప్పుడు కార్మిక వర్గం అనుభవిస్తున్న అనేక హక్కులు హరించిపోతాయని వారు తెలిపారు. కార్మిక చట్టాల మార్పు వల్ల సింగరేణి కి నూతన గనులు రావడం లేదని వారు ఆరోపించారు. సింగరేణి సంస్థలో పని గంటలు పెంచే అవకాశం ఉందని వారు ఆరోపించారు. కార్మికుల సమ్మె చేయడం వలన నాలుగు లేబర్ కోడ్ లు పోతాయని వారు పేర్కొన్నారు. సింగరేణి లో కొత్త గనులు వస్తనే మనుగడ కొనసాగుతుందని, దాని వల్ల ఉద్యోగ భద్రత ఉంటుందని వారు అన్నారు. కార్మికుల శ్రమ దోపిడి ని బడా పారిశ్రామిక సంస్థలకు మోడి ప్రభుత్వం దోచి పెడుతుందని వారు విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటియుసి,ఐఎన్టీయుసి, ఐఎఫ్టియు నాయకులు ఏఐటియుసి బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు అజ్మీరా కిషోర్, ఐఎఫ్టియు భయ్యా వరప్రసాద్,భూక్యా బాలు కుమార్,సామల శ్రీనివాస్, కొసూరి సత్యనారాయణ, జిఎ శ్రీనివాస్, గుగులోత్ బాసు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు భారీగా తరలి రావాలి



**ఇల్లందు,మే 20, ప్రజాజ్యోతి :** భారత రాజ్యాంగంపై మనువాదులు చేసే కుట్రలను తిప్పి కొట్టడానికి భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈనెల 25న భద్రాచలం పట్టణంలో జరిగే సదస్సుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు భారీగా తరలిరావాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి లు పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లందు పట్టణంలోని సింగరేణి గ్రౌండ్ లో జరిగిన జాతీయ మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చాలని మనువాదుల కుట్రలను వ్యతిరేకిస్తూ ఈనెల 25న భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్ లో రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథి, ప్రధాన వక్త, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఎమ్మెల్సీ డా. అద్దంకి దయాకర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన డా.అద్దంకి దయాకర్ కు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా రాజ్యాంగ పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇల్లందు పట్టణ అధ్యక్షులు వేమూరి సాల్మన్ రాజు, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంటి రమేష్, భద్రాచలం నియోజకవర్గ నాయకుడు రుంజా సుమన్, జిల్లా నాయకులు బల్లెం లక్ష్మణ్, సందా ప్రవీణ్, పట్టణ కార్యదర్శి అబ్బూరి సునీల్, నాయకులు మేడిపల్లి బాబురావు, అంబటి కొండలరావు, పిల్లి బాబురావు, వేమూరి రాజు, గుండమల్ల నాగేంద్రం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

- సిఐటియు టౌన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన





**భద్రాచలం టౌన్, మే 20, ప్రజాజ్యోతి :** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, ప్రజా,వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు భద్రాచలంలో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, సిఐటియు నాయకులు గడ్డం స్వామి లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం కార్మికుల ఉద్యోగుల పొట్ట కొట్టే నిర్ణయాలు చేస్తోందని, ఇప్పుడున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 12గంటల పని విధానం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులను, కార్మికులను ఇబ్బంది పెడుతూ కార్పొరేట్ సంస్థలకు మోడీ ప్రభుత్వం దాసోహం చేస్తోందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు ఎలక్ట్రికల్ నాయకులు కొలగాని రమేష్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ బిల్లును విద్యుత్ ఉద్యోగులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు పి సంతోష్ కుమార్, ఎస్ అజయ్ కుమార్, టీ ముత్తయ్య, అప్పారి రాము, డి రామకృష్ణ, చంద్ర లీల, వెంకటలక్ష్మి, జి రామరాజు, మురళీకృష్ణ, బండి ప్రసాద్, రవి, సీతారాములు, కొనసా రవి, సిఐటియు అనుబంధ సంఘాల రంగాల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి నూతనంగా జన్మనరేగా యాప్

- జన్మనరేగా యాప్ పై అవగాహన






**పాల్వంచ(రూరల్), మే 20, ప్రజా జ్యోతి :** ఉపాధి హామీ పథకానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని మన మొబైల్ నందు "జన్మనరేగా" యాప్ ద్వారా తెలుసుకోవచ్చని కోర్స్ డైరెక్టర్ దారా రాజరత్నం తెలియజేశారు. మంగళవారం కోడిపుంజుల వాగు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి జన్మనరేగా యాప్ గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ యాప్ ద్వారా వేతనాలు ఎంత రావలసి ఉన్నది, ఏ ఖాతాకు జమ అయినది పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొబైల్స్ అందుబాటులో ఉన్న కూలీలకు ఈ యాప్ ను ఇన్స్టాల్ చేసి ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ పోరండ్ల రంగా, గ్రామపంచాయతీ కార్యదర్శి హన్నా , సాంకేతిక సహాయకులు సైదులు, క్షేత్ర సహాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దురుసుగా ప్రవర్తించినందుకు ముద్దాయికి ఏడాది జైలు

**భద్రాచలం, మే 20, ప్రజాజ్యోతి :** మహిళపై దురుసుగా ప్రవర్తించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ మంగళవారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ 2022 ఏప్రిల్ 27న గర్భిణికి సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించే సందర్భంలో ముద్దాయి ఎంఎన్వో గుర్రం లాలాఖాన్(అనస్థీషియా) పేషెంట్ మహిళపై అవమానకర రీతిలో ప్రవర్తించాడని భద్రాచలం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. చార్జీషీటు కోర్టులో దాఖలు చేయగా కేసు విషయంలో జడ్జి శివనాయక్ వాదోపవాదాల అనంతరం తీర్పును వెలువరించారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుక




**భద్రాచలం టౌన్, మే 20, ప్రజాజ్యోతి:** భద్రాచలం పట్టణం లో సినీనటులు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కె. అజీమ్ పాల్గొని జూనియర్ ఎన్టీఆర్ కి అభిమానులే కవచకుండలం అని అజీమ్ అన్నారు. మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ 42 వ పుట్టినరోజు సందర్భంగా టీం తారక్ భద్రాచలం అభిమాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాయి, మణిదీప్ ఆధ్వర్యంలో కూనవరం రోడ్డు నందు ఉన్న సరోజినీ వృద్ధాశ్రమం లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ముందుగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... నేటి నుండి భద్రాచలంలో టీం తారక్ భద్రాచలం అభిమాన సంఘం ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీం తారక్ భద్రాచలం గౌరవ సలహాదారులు విజ్జిగిరి రాజా కిరణ్, కోశాధికారి అనిల్, జాయింట్ సెక్రటరీ అరవింద్, ఎక్సక్యూటివ్ మెంబెర్స్ దుర్గాప్రసాద్, కర్రీ విజయ్, కొల్ల విజయ్ పార్థు, అభిరామ్, రాజు, శ్రీను, సంపత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



# స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలి

- కార్మిక హక్కులను బలహీన పరుస్తున్న లేబర్ కోడ్ లు
- స్కీం వర్కర్లకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలి
- సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం






**చర్ల, మే20, ప్రజాజ్యోతి:** స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక హక్కులకు ఉరితాళ్ళు వంటివని సిఐటియు ఆధ్వర్యంలో చర్లలో భారీర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. అనంతరం సిఐటియు మండల నాయకురాలు విజయశీల అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు మండలకన్వీనర్ పాయంరా ధాకుమారి, రైతుసంఘం మండల కార్యదర్శి మచ్చారామారావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను లేబర్ కోడ్ ల అమలు ద్వారా కేంద్ర బిజెపి ప్రభుత్వం బలహీనపరుస్తుందని విమర్శించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలలో కార్మికులకు అనుకూలంగా ఉన్న అనేక అంశాలను నూతనంగా తెచ్చిన లేబర్ కోడుల్లో కేంద్ర ప్రభుత్వం తొలగించిందని పేర్కొన్నారు. శ్రమ దోపిడీని తీవ్రతరం చేయడం, యాజమాన్యాలకు లాభాలు సమకూర్చి పెట్టడం, కార్మిక హక్కులను బలహీన పరచటమే లేబర్ కోడ్ ల సారాంశంగా ఉందని సంఘాల నేతలు విమర్శించారు. దేశంలో కోటి మందికి పైగా ఉన్న స్కీమ్ వర్కర్లకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు వేతన భద్రత, ఉద్యోగ భద్రత లేదని అవేదన వ్యక్తం చేశారు. సుప్రీమ్ కోర్టు తీర్పుఇచ్చినప్పనటికి అంగన్వాడి సిబ్బందికి గ్రాట్యూటి చట్టం అమలుచేయటం లేదన్నారు. లేబర్ కోడ్ లు అమలులోకి రాకముందే దేశంలోని బడా కార్పొరేట్ కంపెనీల అధినేతలు వారానికి 90 గంటలు పని ఉండాలని ప్రభుత్వం మీద ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. పని గంటల పెంపు కార్మికులను మరింత దోపిడీకి, అణిచివేతకు గురి చేస్తుందని, మనిషి జీవన విధానాన్ని దెబ్బ తీస్తుందని అన్నారు. ఇది దేశం యొక్క ప్రగతికి తీవ్ర ఆటంకంగా మారుతుందని కార్మిక నేతలు పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో విడుదల చేసిన ఆర్థిక నివేదిక ప్రకారం దేశంలో కార్మికుల యొక్క నిజ వేతనాలు తగ్గిపోయాయని, ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పడిపోయిందని నివేదిక తేటతెల్లం చేసిందని తెలిపారు. వేతన భద్రత, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కోసం సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం 26,000 అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో జాతి సంపద మొత్తాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు ప్రకృతి వనరులు, ప్రభుత్వ రంగం కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని దీన్ని ప్రతిఘటించేందుకే సార్వత్రిక సమ్మె చేస్తున్నామని సంఘాలు ప్రకటించాయి. ప్రభుత్వ రంగం బలహీన పడితే సామాజిక న్యాయానికి తూట్లు పడతాయని బలహీనవర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కనుమరుగవుతాయని నేతల పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండలనాయకులు పామరు బాలాజి, రైతు సంఘం నాయకులు నవీన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల దొడ్డిహరి నాగవర్మ, డివైఎఫ్ఐ నాయకులు పాముల సాంబ, సిఐటియు నాయకులు నిరోష, హైమావతి, లక్ష్మి, త్రివేణి, సావిత్రి, ఉష, హైమ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22న వాహనాలకు వేలం

**భద్రాచలం, మే 20, ప్రజాజ్యోతి :** భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ లో 22వ తేదీన ఉదయం 10 గంటలకు పాత వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలో ఆసక్తి కలిగిన పాటదారులు పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చని తెలిపారు.

## టిడిపి మండల అధ్యక్షుడిగా గుడిపూడి మోహన్ రావు



**టేకులపల్లి,మే20, ప్రజాజ్యోతి:** తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడిగా టేకులపల్లి మండలం చెందిన అధ్యక్షుడిగా గుడిపూడి మోహన్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో తెలుగుదేశం రాష్ట్ర పార్టీ పరిశీలకులు ఎండి. ఇమామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ తరపున గుడిపూడి మోహన్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నలమాస శంకర్, ప్రధాన కార్యదర్శిగా గజ్జల రామ్ శేఖర్, కోలుకూరి రవిశంకర్, కార్యనిర్వాహక కార్యదర్శులు ఆంగోత్ చందులాల్, మసిపాక రామస్వామి, నెల్లూరి శ్రీను, కార్యదర్శులు జర్పుల గణేష్, జాటోత్ శిరీష్, కోశాధికారి రామారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం తెచ్చి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ





**టేకులపల్లి,మే20,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీఈఆర్టీ వారిచే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు వారి సబ్జెక్టులలో నైపుణ్యానికై ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా జి హెచ్ఎస్ టేకులపల్లిలో జిల్లాలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఏం. వెంకటేశ్వర చారి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో కోర్సు ఇంచార్జి మెరుగు శ్రీనివాస్.జిల్లా ఫైనాన్సియల్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు, సాయికృష్ణ, డి ఆర్ పిలు నరేశ కుమార్ , కవిత , రామనాధం ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

## దళిత రత్న అవార్డు అందుకున్న కుక్కముడి సంపత్



**చుంచుపల్లి, మే 20 (ప్రజాజ్యోతి ):** గత 35 సంవత్సరాలుగా వైద్య రంగంలో విశిష్ట సేవలు, పేదలకు ఉచితంగా సేవలు అందిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలానికి చెందిన కుక్కముడి సంపత్ ను రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డు ఎంపిక చేసింది. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్, బాబు జాగ్జీవన్ రామ్, 134 జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమం లో మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు జున్ను కనకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇటుక రాజు, రాష్ట్ర అధ్యక్షులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా భాద్యులు డాక్టర్ కోరిపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రాంతం లో ఎన్నో ఏళ్లుగా స్థానికులకు సూపరిచిలుగా ఉంటు పలు రకాల సేవా కార్యక్రమంలో అయన చురుగ్గా పాల్గొన్నారు.అనంతరం సంపత్ మాట్లాడుతూ తన సేవా కార్యక్రమలను గుర్తించి దళిత రత్న అవార్డు ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్యాశాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహా లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 10 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత




**టేకులపల్లి,మే20,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకులో ప్రమాద బీమా చెక్కును ఎస్బిఐ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రీజినల్ మేనేజర్ సత్యనారాయణ బాధితులకు అందజేశారు. గత సంవత్సరం జైత్రంతండ గ్రామానికి చెందిన కేలోత్ నరేష్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో తన చేయి కోల్పోవడం జరిగింది. బాధితుడు ఎస్బిఐలో జనరల్ ఇన్సూరెన్స్ వెయ్యి రూపాయలు కట్టి ప్రమాద బీమా పొంది ఉండడం వలన అతనికి ఎస్బిఐ బ్యాంకు ద్వారా ఇన్సూరెన్స్ పదిలక్షలు చెక్కును బ్యాంకు సిబ్బంది అందించడం జరిగింది. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ కట్టడం వలన ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే తధాంతరం కుటుంబానికి భరోసా అవుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్ జె.మురళి ,సీఎం సేల్ రమేష్, సి ఎస్ ఎం రాళ్ల బండి కిరణ్ కుమార్ రెడ్డి, పి. జంపయ్య,మూడు కృష్ణ, బిచ్చు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన సిపిఐ నేతలు



**ములకలపల్లి, మే 20, ప్రజాజ్యోతి:** ములకలపల్లి మండల నూతన తహసీల్దార్ గా బాధ్యతలు తీసుకున్న గన్య నాయక్ ను మంగళవారం సిపిఐ పార్టీ బృందం జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, మండల నాయకులు ఎంపీటీసీ షేక్ జబ్బార్, నరాటి రమేష్, మహేష్, సమ్మయ్య, ఆటో యూనియన్ నాయకులు బుగ్గరాపు సత్యనారాయణ లు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలం లో నెలకొని ఉన్న సమస్యల పరిస్కారం కోసం కృషి చెయ్యాలి తహసీల్దార్ కు విజ్ఞప్తి చేశారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , మే 20(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న జంటలకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

# కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్






**ములకలపల్లి, మే 20, ప్రజాజ్యోతి :** బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు .మంగళవారం మండల కేంద్రంలోని సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించి తాహశీల్దార్ గున్యా నాయక్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ పెట్టుబడి దారి అనుకూల విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం అను సరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఖండించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి నిమ్మల మధు మాట్లాడుతూ..45 రోజుల వ్యవధిలోనే కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసర్వించుకోవాలని అన్నారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తుల పై కనీస మద్దతు ధర కల్పించి, సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్మికుల మెడకు గుదిబండగా మారిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసర్మించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నరాటి రమేష్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ ధనలక్ష్మి, (సిఐటియు) ఏఐటీయూసీ మండల కార్యదర్శి షేక్ జబ్బర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఓరుగంటి శ్రీను, ఏఐటియుసి మండల కమిటీ సభ్యురాలు పుష్పావతి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గంటా శ్రీనివాస్, చిక్కుల శ్రీనివాస్, గద్దల మహేష్, పుల్లారావు, గోపగాని లక్ష్మీ నరసయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.